ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలి

లింగంపేట/కామారెడ్డి, మార్చి 28 : ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కవిత పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అన్నారు. లింగంపేటలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం ఎమ్మెల్సీ కవిత ఎల్లారెడ్డి నియోజకవర్గం రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాఠశాల తనిఖీ

కంప్యూటర్ పాఠాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు

రామారెడ్డి, మార్చి 28 : మండలంలోని మద్దికుంట గ్రామంలో ఉన్న పాఠశాలను రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కంప్యూటర్ పాఠాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమెతో పాటు మండల విద్యాధికారి ఆనంద్‌రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి ఉన్నారు.

అంధకారంలో దేవివిహార్ ఫేస్-2



లైట్ వెలగని విద్యుత్ స్తంభం

కామారెడ్డి, మార్చి 28 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవి విహార్ ఫేస్-2లో రెండు నెలల నుంచి కరెంటు స్తంభాలకు లైట్లు వెలగడం లేవని స్థానికులు తెలిపారు. దేవివిహార్ ఫేస్ 2 కామారెడ్డి పట్టణానికి దూరంగా ఉందని, రెండు నెలలుగా చీకటి ఉండడంతో భయాందోళనకు గురవుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపల్‌లో లైట్లు లేవని, వచ్చాక బిగిస్తామని, అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయాయని, ఇంకా ఎన్ని నెలలు వేచి ఉండాలని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదించగా మున్సిపల్‌కు ఇంకా కొత్త లైట్లు రాలేవని, వచ్చాక లైట్లను బిగిస్తామని సమాధానం ఇచ్చారని తెలిపారు.

‘ఉపాధి’లో ప్రతి కూలీకి పని కల్పించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట(తాడ్వాయి), మార్చి 28: ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామంలోని భీమేశ్వర ఆలయం వద్ద చెక్‌డ్యాంలో పూడిక తీత పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రతి కూలీకి కచ్చితంగా పని కల్పించాలని సూచించారు. సంతాయిపేట గ్రామంలో 240 గృహాలు ఉండగా 316 జాబ్‌కార్డులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 280 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉపాధి హామీలో వారం రోజులుగా పూడిక తీత పనుల్లో పాల్గొనగా కూలీ డబ్బులు చెల్లించడం లేదని కూలీలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కూలీ డబ్బులు చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని కూలీలు కోరడంతో స్పందించి కలెక్టర్ డబ్బులు పోస్టాఫీసులో కాకుండా బ్యాంకు ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో సురేందర్‌కు ఆదేశాలు జారీ చేశారు. భీమేశ్వర ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన కాలం నాటి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. ఆలయం వద్దకు రహదారితోపాటు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయాలని చెప్పారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా గ్రామంలోని ప్రకృతి వనంలో మొక్కలకు నీటిని పట్టారు. అనంతరం గ్రామానికి చెందిన ప్రమీల అనే లబ్ధిదారురాలికి మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణం కోసం మార్కింగ్ చేసిన భూమి పూజ నిర్వహించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలో రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి రాజారాం, డీఆర్డీవో సురేందర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ, ఎంపీడీవో సాజిద్‌తోపాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంతాయిపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

హత్య కేసులో నిందితుల అరెస్టు

కామారెడ్డి, మార్చి :28: దోమకొండ మండలం చింతామన్ పల్లిలో గురువారం ఈరబోయిన రమేశ్ హత్యకు గురికాగా..ఈ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ చైతన్యారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. దోమకొండ మండలంలోని ముత్యంపేటకు చెందిన రమేశ్ గతేడాది డిసెంబర్‌లో తన భార్య పేరుమీదున్న మారుతి షిఫ్ట్ కారును రూ.3లక్షల 85 వేలకు అదే మండలంలోని చింతామన్‌పల్లి గ్రామానికి చెందిన పోచయ్య కొనుగోలు చేశాడు. కారుకు సంబంధించిన డబ్బులు బాకీ ఉండడంతో పలుమార్లు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గురువారం చింతామన్‌పల్లి గ్రామ శివారులో పోచయ్య తన ఇటుక బట్టి వద్ద ఉండగా.. ఉదయం 3 గంటల ప్రాంతంలో రమేశ్ అక్కడికి రాగా ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. ఈ క్రమంలో రమేశ్‌పై పోచయ్య కర్రతో గట్టిగా బాదడంతో అక్కడే పడిపోయాడు. అనంతరం బట్టిలో పనిచేసే రాజ్‌కుమార్, రమేశ్, బీడీశెట్టి నాయక్‌తోపాటు అల్లుడు హరీశ్..రమేశ్‌ను తాళ్లతో కట్టి వేసి తీవ్రంగా కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రమేశ్‌ను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, నిందితులను అరెస్టు చేసి నిజామాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన విచారణాధికారి భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్,దోమకొండ ఎస్సై ప్రవంతి, కానిస్టేబుల్ రాజ గౌడ్,కిరణ్,రాములను అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

పరీక్షా కేంద్రం తనిఖీ

లింగంపేట, మార్చి 28 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎల్లారెడ్డి సీఐ శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లాలోని పలుచోట్ల పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ జరగడంపై పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినప్పటికీ విద్యార్థులు తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు వస్తున్నట్లు చెప్పారు. మాస్ కాపీయింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్‌హెచ్‌వో ప్రకాశ్‌నాయక్, సిబ్బంది జయ్‌కుమార్, దివ్య, హామేద్ తదితరులు ఉన్నారు.

బస్వాపూర్‌లో దొంగల హల్‌చల్

భిక్కనూరు, మార్చి 28: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలోని తొమ్మిది ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గురువారం రాత్రి తాళాలు వేసి ఉన్న తొమ్మిది ఇండ్లలోకి గుర్తుతెలియని దుండగులు చొరబడ్డారు. మొత్తం 56 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు దుండగుల వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

మాచారెడ్డి, మార్చి 28 : మండలంలోని లచ్చాపేట జడ్పీ హెచ్ఎస్‌కు గ్రామానికి చెందిన చెప్యాల గోవర్ధన్‌రెడ్డి రూ.50 వేల విలువైన ఫర్నిచర్‌ను అందజేశారు. పాఠశాలకు ఫర్నీచర్ అవసరం ఉన్నదని తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి రెండు బీరువాలు, ఐదు కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలను అందజేశారు. ఫర్నీచర్‌ను అందజేసిన దాతకు ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మొబైల్ ఫోన్..

మాచారెడ్డి,మార్చి 28 : మండలంలోని గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్ గ్రామానికి చెందిన దొంతరబోయిన రంజిత్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ఆందోళన చెందకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మార్చి 28 : హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి స్రవంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారని తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కన్నా తక్కువ ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 8వ తేదీ వరకు www.tgbcstudycircle.cgg.gov.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఏప్రిల్ 12 వ తేదీ ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టులో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 08462-241055 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తుదారుల సర్వే

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 28 : డబుల్ బెడ్ రూం ఇండ్ల దరఖాస్తుదారుల పరిస్థితిపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని సోమార్‌పేట్‌బేస్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఇప్పటివరకు ఖాళీగా ఉన్న 41 ఇండ్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తుదారుల పరిస్థితిని పరిశీలిస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూం ఇంటికి అర్హులా అనే విషయాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

నాగిరెడ్డిపేట, మార్చి 28 : శాంతియుత వాతావరణంలో.. ఉగాది, రంజాన్ ఉత్సవాలను జరుపుకోవాలని సీఐ రవిందర్‌నాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నల్లపోచమ్మ ఆలయ కమిటీ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ముస్లింలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఉగాదికి మండల ప్రజలు ఘనంగా జరుపుకొనే నల్లపోచమ్మ జాతర ఉత్సవాలు, తర్వాతిరోజు వస్తున్న రంజాన్‌ను దృష్టిలో పెట్టుకొని కుల మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

పీస్ కమిటీ మీటింగ్

బీబీపేట్(దోమకొండ), మార్చి 28 : దోమకొండలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ప్రవంతి శుక్రవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉగాది, రంజాన్ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

గుండారం తైబజార్ వేలం

రాజంపేట్, మార్చి 28 : మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం తైబజర్ వేలాన్ని నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. 2025-26 సంవత్సరానికిగాను వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన పోతుల సుదర్శన్ రూ.రెండు లక్షల 65 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నస్రుల్లాబాద్, మార్చి 28 : మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కీసరి రాములు ఇటీవల గ్రామ శివారులోని చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. బాన్సువాడ మున్సిపల్ మాజీ చైర్మన్ జుబేర్, నాయకులు నర్సింహులు గౌడ్, అఫ్రోజ్, సాయిలు, గంగారాం, అంజయ్య, బాలయ్య, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 28 : వేసవి సెలవుల్లో ఇంటి వద్ద, గ్రామంలో, బంధువుల ఇండ్ల వద్ద అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై మహేశ్ సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మగ పిల్లలు ఈత కొట్టడానికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. సోషల్‌మీడియా వాడకంలో జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. ఆయనతోపాటు కళాజాత బృందం, షీ టీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలు

కామారెడ్డి, మార్చి 28 : ఇటీవల మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో అవకతకవలు జరిగాయని బీసీ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో మ్యాన్ పవర్ సొసైటీ ఏజెన్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మెరిట్ లిస్ట్ పెట్టకుండా డబ్బులు ఇచ్చిన అభ్యర్థులకు మాత్రమే ఆర్డర్ కాపీని తీసుకొని వెళ్లండి అని చెప్పారని ఆరోపించారు. కలెక్టర్ పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్, సంజయ్, రఘువరన్, రవి, గణేశ్, మమత, గోవర్ధన్, శ్రీకాంత్, మంజుల పాల్గొన్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నస్రుల్లాబాద్, మార్చి 28 : బీర్కూర్ మండలం మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంజీరా నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

నస్రుల్లాబాద్‌లో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అధికారులు, నాయకులు

నస్రుల్లాబాద్, మార్చి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్యామల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో..

నాగిరెడ్డిపేట, మార్చి 28 : మండల కేంద్రం గోపాల్‌పేట మసీదులో మాల్తుమ్మెద విండో మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపాల్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపిక

పెద్ద కొడప్‌గల్, మార్చి 28 : ఆర్మీ నియామకాల్లో భాగంగా అగ్నివీర్‌కు పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల అంజయ్య ఎంపికైనట్లు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. కష్టపడి చదివి అగ్నివీర్ ఉద్యోగాన్ని సాధించిన అంజయ్యను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఓటీఎస్ కాలపరిమితి పెంచాలని తీర్మానం

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్/నస్రుల్లాబాద్/ రాజంపేట్/ బిచ్కుంద, మార్చి 28 : దీర్ఘ కాలిక రుణాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కాలపరిమితి జూన్ 30వ తేదీ వరకు గడువు పెంచాలని తీర్మానం చేశారు. లింగంపేట మండలంలోని నల్లమడుగు సహకార సంఘంలో మహాజన సభను చైర్మన్ సుప్పాల రమేశ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఓటీఎస్ పథకం ఈ నెల 31వ తేదీకి ముగుస్తున్నందున గడువు తేదీని పెంచాలని రైతులు కోరారు. రెండు లక్షల రూపాయలు రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, మాఫీ కాని రైతులకు ఏకకాలంలో మాఫీ చేయాలని రైతులు కోరారు. యాసంగిలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కాకుండా సహకార సంఘాల వారి ఆధీనంలో ఏర్పాటు చేయాలని, నల్లమడుగు సహకార సంఘానికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో సహకార సంఘం సీఈవో మహిపాల్‌రెడ్డి, సభ్యులు నారాయణ, శ్రీనివాస్, బాగయ్య, సురేందర్‌తోపాటు సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో మహాజన సభను సొసైటీ చైర్మన్ ఏగల నర్సింహులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి విశ్వనాథం జమాఖర్చులను చదివి వినిపించారు. లింగారెడ్డిపేట్, అడ్డిపలింగాల గోదాములకు మరమ్మతులు చేసి ప్రహరీ నిర్మించాలని తీర్మానం చేశారు. మహాజన సభలో వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాజంపేట మండలంలోని ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో అధ్యక్షుడు శివరాములు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సెక్రటరీ సాయిలు సభ్యులకు జమాఖర్చులను చదివి వినిపించారు. సొసైటీ డైరెక్టర్లు మల్లారెడ్డి, రాజిరెడ్డి, మధుకర్, చిన్న సాయిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలోని రైతు సేవా సహకార సంఘం మహాజన సభను నాల్చర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘం కార్యదర్శి శ్రావణ్ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, ఎకరాకు 25 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని తీర్మానించారు. వైస్ చైర్మన్ యాదారావు, డైరెక్టర్లు సంజు, అశోక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నల్లమడుగులో మాట్లాడుతున్న చైర్మన్ రమేశ్

రసాభాసగా మహాజన సభ

బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు మహాజన సభ రసాభాసగా సాగింది. సొసైటీ పాలక వర్గం, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రాథమిక సహకార సంఘాల్లో, రేషన్ దుకాణాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని, బంరంగేడ్గి గ్రామంలో వ్యవసాయ గిడ్డంగి నిర్మాణం కోసం రూ.55 లక్షలు పెట్టి ఎకరం భూమి ఎందుకు కొన్నారని, రైతుల డబ్బులను ఎందుకు వృథా చేస్తున్నారని పాలకవర్గాన్ని నిలదీశారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

లింగంపేట, మార్చి 28 : గ్రామంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని మెంగారం గ్రామంలో శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీరు పట్టారు. మొక్కల సంరక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఎంపీడీవో వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

‘పద్య దర్శిని’ పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు పున్న రాజేశ్వర్

కామారెడ్డి, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరంలో ప్రముఖ కవి గంగప్రసాద్ రచించిన పద్య దర్శిని పుస్తకాన్ని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు పున్న రాజేశ్వర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవి రచయిత గంగప్రసాద్ ఉపాధ్యాయుడిగా, కవిగా రాణిస్తూ పద్య రచనలో ఎన్నో మెళకువలు పాటిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కాలమిస్ట్ రచయిత లచ్చయ్య, తె.ర.వే. జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, కవులు సూరారం శంకర్, పీతాంబర్, నాగభూషణం, మోహన్‌రాజ్, రాంచంద్రం, నమిత, సునీత, నర్సయ్య, తిరుపతి, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

లింగంపేట, మార్చి 28 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులు, వంట గది, స్టాక్ రూం, సరుకుల నిల్వ, ఎల్ఈపీ కార్యక్రమం వివరాలను పరిశీలించారు. ఆమె వెంట పాఠశాల ఎస్‌వో వాసంతి, సీఆర్‌పీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు హేమలత, మీనా, మౌనిక ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాశ్‌పటేల్

బిచ్కుంద, మార్చి 28 : బిచ్కుంద బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్ పటేల్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్ దేశ్‌ముఖ్, జనరల్ సెక్రెటరీగా శివాజీ, ట్రేజర్‌గా విఠల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మణ్ రావు, మల్లేశం, మహ్మద్, విఠల్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది

★నేను ఎన్.ప్రణీత్‌కుమార్ తండ్రి ఎన్.ఇసయ్య, R/o. ఇ.నెం.4-77/3, గ్రా|| & మం|| డిచ్‌పల్లి, జి|| నిజామాబాద్ నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 2469/2006 గల దానిని తీసుకొని కామారెడ్డి ఎస్ఎస్ రోడ్ నుండి గాంధారికి ప్రయాణిస్తున్న సమయంలో ఎక్కడో పడిపోయింది కావున దొరికినవారు ఈ నెంబర్‌కు తెలియజేయగలరు. సెల్: 8897915144

NTZ-338571

CHANGE OF NAME

★I, A.SATHYANARAYANA (Old name) S/o. ALUVALA POTHANA RAO, R/o. H.No.1-38/1/A, Vill: Madhapur, Mdl: Makloor, Dist. Nizamabad, T.G. have change my Surname/Name as ALUVALA SATHYANARAYANA RAO (New name) S/o. ALUVALA POTHANA RAO

NTZ - 338422

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైనుకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

కూరగాయల మార్కెట్ త